సాక్షి
తిరుపతి
ఆదివారం । 6 । జూలై । 2025



10న మెగా పీటీఎం

ఈనెల 10న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. - 8లో



లోక్ అదాలత్‌లో 2352 కేసులు

తిరుపతిలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,352 కేసులు పరిష్కారం అయినట్లు మూడో అదనపు జిల్లా జడ్జి తెలిపారు. - 8లో



ఐఐటీలో ముగిసిన సదస్సు

తిరుపతి ఐఐటీలో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. - 8లో

న్యూస్‌రీల్

హాస్టళ్లలో ప్రవేశాలు



భరత్‌కుమార్ రెడ్డి, బీసీ హాస్టల్స్ జిల్లా అధికారి

తిరుపతి అర్బన్ : జిల్లా వ్యాప్తంగా బీసీ హాస్టల్స్‌లో అడ్మిషన్లు చేసుకుంటున్నామని, ప్రస్తుతం జిల్లాలోని 62 హాస్టల్స్‌లో 5060 మంది వరకు విద్యార్థులు ఉన్నారని బీసీ హాస్టల్స్ జిల్లా అధికారి భరత్‌కుమార్ తెలిపారు. 2025–26కి సంబంధించి విద్యార్థులకు అందించాల్సిన అన్ని వస్తువులను అందిస్తున్నామన్నారు. ప్రధానంగా మెనూ ప్రకారం భోజనం పెట్టాలని వార్డెన్స్‌కు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ప్రతి హాస్టల్‌లోను నాణ్యమైన ఆహారం అందించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని పేర్కొన్నారు. సమీప ప్రాంతాల్లో ఏదైన ఫంక్షన్లు జరిగితే మిగిలిన భోజనం హాస్టల్స్‌కు ఇస్తే తీసుకోరాదని స్పష్టం చేశామన్నారు. జిల్లాలోని ప్రతి హాస్టల్‌ను తనిఖీ చేస్తున్నట్లు వివరించారు.

ఇసుక తవ్వకాలకు కొత్త నిబంధనలు

- అరణియార్,స్వర్ణముఖిలో తవ్వకాలు నిషేధం

తిరుపతి అర్బన్ : ఇసుక తవ్వకాలకు కొత్త నిబంధనలు వచ్చాయని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియా కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం, పర్యావరణం, అటవీ , వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారు నదులలో ఇసుక తవ్వకం , రవాణాకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలను జారీ చేసిందని తెలిపారు. జిల్లాలో స్వర్ణముఖినది, అరణియార్ నుంచి అక్టోబర్ 15 వరకు ఇసుక తవ్వకాలు నిషేధించాలని స్పష్టం చేశారు. అయితే పంచాయితీ పరిధిలోని వాగులు, వంకల నుంచి సచివాలయం అనుమతులతో రసీదు తీసుకుని ఉచితంగా పొందవచ్చునని చెప్పారు. మిగిలిన వారు గూడలి (స్వర్ణముఖి బేరేజీ) డీ-సిల్టేషన్ యార్డు-ఆవిలాల (తిరుపతి) యార్డు, కాటన్ మిల్ (తిరుపతి) యార్డు, గాజులమాండ్యం (రేణిగుంట) యార్డు, శ్రీకాళహస్తి యార్డు, వెంకటగిరి యార్డుల్లో ఇసుకను తీసుకుపోవచ్చునని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు నిఘా ఉంటుందని వివరించారు.

కూటమి అరాచకం

చంద్రగిరిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు

- ప్రతిపక్ష పార్టీని లేకుండా చేయాలనే కుట్ర
- తలలు పగలగొడుతుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర
- బాధితులపైనే కేసుల నమోదు

చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ నేతలు అదును చూసి అరాచకాలకు తెగబడుతున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులు చేస్తూ ప్రజలు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఎప్పుడూ లేని విధంగా పల్లెల్లో రాజకీయ కవ్వింపులకు దిగి ప్రత్యర్థి పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు బాధితులపైనే కేసులు పెడుతుండడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడుతున్నారు. ప్రశాంతంగా ఉన్న చంద్రగిరిలో కూటమి నేతలు నిప్పు రాజేస్తున్నారు. టీడీపీ అకృత్యాలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉద్యమాలకు సమాయత్తం అవుతున్నారు.



ఏడాది కాలంగా గ్రామంలోకి రానీయకుండా బహిష్కరించిన సర్పంచ్ భారతి కుటుంబీకులను పరామర్శిస్తున్న పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి (ఫైల్)

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ అదును చూసి.. అరాచకాలకు తెర లేపింది. తమ క్యాడర్‌కు అండగా నిలబడతాడనుకున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్రమ కేసుల్లో ఇరికించి అరెస్టు చేయించారు.. ఆ నాయకుడి కుమారుడు పైనా తప్పుడు కేసులు పెట్టి క్యాడర్‌కు దూరమయ్యేలా చేశారు. ఎవ్వరి అండా లేదని తెలుసుకుని పార్టీ శ్రేణులపై విచక్షణారహితంగా దాడులకు తెగబడుతున్నారు. అందరూ చూస్తుండగానే ఒంటిపై కారం చల్లడం.. కర్రలతో తలలు పగలగొట్టడం.. మహిళ మెడలో మంగళ సూత్రాలు తెంచడం వంటి అకృత్యాలకు పాల్పడుతున్నారు. ప్రశాంతమైన పల్లెల్లో టీడీపీ గూండాలు చేస్తున్న అరాచకాలకు పోలీసులు అండగా నిలబడటంతో మరింతగా రెచ్చిపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటి వరకు చంద్రగిరిలో ఎన్నడూలేని విధంగా పల్లెల్లో రాజకీయ వైషమ్యాలను కలిగిస్తున్నారు. ఎన్నికల్లో ఎవరికి వారు నచ్చిన పార్టీకి పని చేయడం, ఆ తరువాత ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అన్నదమ్ముల్లా కలిసి మెలసి ప్రశాంతమైన రాజకీయాలు చేసుకునే చంద్రగిరిలో ప్రస్తుతం అరాచకాలకు అడ్డులేకుండా పోతోంది.

కుట్రలో భాగంగానే దాడులు

చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అక్రమ కేసులో అరెస్టు జరిగిన తరువాత చంద్రగిరిలో ఏం జరుగుతోంది..? ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌పై అధికార టీడీపీ నేతలు చేస్తున్న వరుస దాడులకు కారణం ఏమిటి ? ప్రశాంతమైన పల్లెల్లో రాజకీయ చిచ్చు పెడుతున్నది ఎవ్వరు? బాబు స్వగ్రామం చంద్రగిరిలో ప్రత్యర్థి పార్టీని లేకుండా చేయాలనేనా..? అందులో భాగంగానే వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని అక్రమ కేసులో ఇరికించారా..? చంద్రగిరి ప్రజలకు పదేళ్లు ఎమ్మెల్యేగా సేవలు అందించిన చెవిరెడ్డిని జైలుకు పంపింది ఆ వ్యూహంలో భాగమేనా..? అన్న ప్రశ్నలకు అందరి నుంచి అవుననే సమాధానమే వస్తోంది. అయితే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అతని కుమారుడు మోహిత్ రెడ్డి నాయకత్వంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాడర్ చాలా బలంగా ఉంది. రాజకీయ విద్వేషాలను మనసులో పెట్టుకుని ఉద్దేశపూర్వకంగా వైఎస్ఆర్‌సీపీ సానుభూతి పరులను పది మందిలోకి పిలిపించడం, ఆ తరువాత అవమాన పరిచి దాడులకు తెగబడుతున్న టీడీపీ గూండాలపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడాన్ని అన్నివర్గాల ప్రజలు తప్పు బడుతున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా స్థాయి పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఈనెల 9వ తేదీన చిత్తూరు జిల్లా పర్యటనకు వచ్చే వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి చంద్రగిరి పార్టీ నేతలు వివరించనున్నట్లు సమాచారం.



టీడీపీ కార్యకర్త శ్రీను దాడి చేయడంతో తలకు కుట్లు వేయించుకుంటున్న వైఎస్ఆర్‌సీపీ నేత ప్రవీణ్ కుమార్



తన కుటుంబంపై టీడీపీ నేతలు దాడి చేయడంతో న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌కు వచ్చిన అజయ్ కుమార్, అతని వర్గీయులు (ఫైల్)



దాడిలో గాయపడిన ముంగిలిపట్టు సర్పంచ్



తాళిబొట్టు తెంచేయడంతో స్టేషన్‌కు వచ్చిన సర్పంచ్ భారతి

బరితెగింపు

అధికారంలో ఉన్న టీడీపీ నేతలు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ క్యాడర్‌ను టార్గెట్ చేసుకుని వరుసగా దాడులు చేస్తున్నారు. ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల రక్తం కళ్ల చూడాలనుకునే టీడీపీ గూండాలు బరితెగించి దాడులు చేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తుండటంపై బాధిత కుటుంబీకులు దుమ్మెత్తిపోస్తున్నారు. చంద్రగిరిలో టీడీపీ చేస్తున్న దౌర్జన్యం, పోలీసుల సహకారంపై ఈనెల 7వ తేదీన తిరుపతి జిల్లా ఎస్పీని కలిసి వినతి పత్రం అందించాలని, అప్పటికీ న్యాయం జరగకుంటే బాధితులతో కలసి ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతామని చంద్రగిరి నియోజకవర్గంలోని పార్టీ నేతలు హెచ్చరిస్తున్నారు.

ఎస్పీని కలసి.. ఆపై ప్రత్యక్ష ఆందోళనలు

చంద్రగిరి మండలంలో గత వారం రోజులుగా టీడీపీ గూండాలు చేసిన దాడుల్లో ముంగిలిపుట్టు సర్పంచ్ భారతి ఆమె కుటుంబీకులతో పాటు పనపాకం హరిజనవాడకు చెందిన అజయ్ కుమార్ కుటుంబీకులు, నరసింగాపురం పంచాయతీ పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. అయినా సరే గాయపడిన వారిపైనే కేసులు నమోదు చేయడం, దాడి చేసిన వారిని పోలీసులు అరెస్టు చేయకపోవడాన్ని దళిత సంఘాలు, ప్రజా సంఘాల నేతలు తప్పు బడుతున్నారు. చంద్రగిరిలో వరుసగా జరిగిన దాడులు, ఆ దాడులకు కారణమైన వారికి పోలీసులు అందించే సహకారంపై ఆధారాలతో సహ తిరుపతి జిల్లా ఎస్పీని కలసి వినతి పత్రం అందించాలని స్థానిక పార్టీ నేతలు సన్నద్ధవుతున్నారు. అప్పటికీ న్యాయం జరగకుంటే ఎస్పీ కంటే పైస్థాయి అధికారులను కలవడం, బాధిత కుటుంబాలతో కలసి ఆందోళనలు చేపట్టడం వంటి చర్యలు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. చంద్రగిరిలో జరుగుతున్న అకృత్యాలు, అరాచకాలపై రాష్ట్ర స్థాయిలో వైఎస్ఆర్‌సీపీ నేతలు అందరికీ వివరించి వారి ద్వారా డీజీపీకి ఫిర్యాదు చేయించాలన్న వాదన స్థానిక పార్టీ నేతల్లో బలంగా వినిపిస్తోంది. ఇప్పటికే జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి దృష్టికి ఆ విషయాన్ని తీసుకువెళ్లడంతో ఆయన ద్వారా పార్టీ పెద్దలకు తెలియజేయాలని కోరినట్లు సమాచారం.

ఏం సాధిస్తారో..?

వైఎస్ఆర్‌సీపీ నేతలపై టీడీపీ గూండాలు వరుసగా దాడులు చేయడం వల్ల ఏం సాధించాలని అనుకుంటున్నారో చెప్పాలని చంద్రగిరి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. శరీరంపై కారం చల్లడం, కర్రలతో తల పగలగొట్టడం, చేతులు విరిచేయడం వంటి చర్యలతో ప్రత్యర్థి పార్టీ నేతల రక్తం కళ్ల చూసి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. గత ప్రభుత్వంలో చెవిరెడ్డి టీడీపీకి చెందిన ముఖ్య నేతలందరినీ ఎంతో మంచిగా చూసుకున్నారు కాబట్టే ఏడాది క్రితం జరిగిన ఎన్నికల సమయానికి టీడీపీ క్యాడర్ గట్టిగా నిలబడిందన్న విషయం గుర్తు చేసుకోవాలని వైఎస్ఆర్‌సీపీకి చెందిన నేతలు సూచిస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని టీడీపీ నేతలను చెవిరెడ్డి ఎక్కడా ఇబ్బంది పెట్టలేదన్న విషయం ఆ పార్టీలోని సీనియర్లు అందరికీ తెలుసని, అయినా వారు ఈ సమయంలో మౌనం వహించి భౌతిక దాడులను ప్రోత్సహించడం భవిష్యత్తు తరాలకు మంచిది కాదంటున్నారు. కరోనా సమయంలో చెవిరెడ్డి చేసిన సాయం వల్ల ఎంత మంది టీడీపీ నేతలు ప్రాణాలతో బయటపడ్డారో ఒక్కసారి గుండెలపై చేయి వేసుకుని ఆలోచన చేయాలంటున్నారు.

వణుకెందుకు బాబు?

- ఎన్ని ఆంక్షలు పెట్టినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళెం రావడం ఖాయం
- మామిడి రైతులకు అండగా నిలవడం తప్పా?
- హెలీప్యాడ్‌కు కూడా అనుమతివ్వకుండా ఆంక్షలా?
- మాజీమంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజం



పలమనేరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పలమనేరు: 'ప్రజల పక్షాన నిలిచేందుకు ప్రతిపక్ష నేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తే కూటమి ప్రభుత్వం ఆంక్షలు పెట్టడం దేనికని?. అంత బెదురెందుకని..' అంటూ రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మామిడికి గిట్టుబాటు ధర కోసం ఈనెల 9న బంగారుపాళెంకు వస్తున్న సందర్భంగా పలమనేరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జిల్లా నేతలతో ఆయన శనివారం సన్నాహక సమావేశాన్ని నేర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఘోరంగా మారిందన్నారు.ఇప్పటికే పొగాకు, మిరప, టమాట రైతులు నష్టాల్లో కూరుకుపోయారని వాపోయారు. ఇప్పుడు మామిడి రైతులు కూడా ఆ కోవలో చేరారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మామిడిని అమ్ముకోలేక రైతులు పడుతున్న బాధలు వర్ణణాతీతమన్నారు. పొరుగునే ఉన్న కర్ణాటకలో రైతులకు అక్కడి ఎంపీ కేంద్రానికి లేఖ రాసి వారిని ఆదుకున్న విషయం తెలిసిందేనన్నారు. కానీ కూటమిలో భాగస్వాములైన టీడీపీ, జనసేన నేతలు ఇక్కడి మామిడి రైతుల కష్టాన్ని ఎందుకు కేంద్రం దృష్టికి తీసుకెళ్లలేదని ప్రశ్నించారు.

హెలీప్యాడ్‌కు అనుమతులివ్వడం లేదు

ప్రతిపక్ష నేతగా మామిడి రైతులకు అండగా నిలిచేందుకు వస్తున్న మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటకు హెలీప్యాడ్‌కు సైతం అనుమతులు ఎందుకు ఇవ్వడం లేదని మాజీ మంత్రి ప్రశ్నించారు. అసలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడికైనా వస్తున్నారంటే కూటమి ఎందుకు అంతలా వణికిపోతోందే అర్థం కావడం లేదన్నారు. మొన్నటి దాకా తోతాపురికి ధరలేక కాయలు అమ్ముకోలేక తోటల్లో వదిలేస్తున్నా పట్టించుకోని సీఎం ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నాడని తెలిసి మామిడిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అంటే జగన్ వస్తేగానీ రైతుల కష్టం ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఇలా..

ఈనెల 9న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో ఏపీ బోర్డర్ గంద్రాజుపల్లి, నాలుగు రోడ్లు, పలమనేరు బైపాస్ మీదుగా బంగారుపాళెంకు చేరుకుంటారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు వెంకటేగౌడ, డాక్టర్ సునీల్, మాజీ ఎంపీ రెడ్డెప్ప, జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మొగసాల రెడ్డెప్ప, హేమంత్‌కుమార్ రెడ్డి, ఎస్వీ మురళీకృష్ణ, చెంగారెడ్డి, దయానంద్‌గౌడ, కన్వీనర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

- రెండో రోజు కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



తిరుపతి డిపోలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఎంప్లాయిస్ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మస్తాన్ పేర్కొన్నారు. తిరుపతి డిపోలో రెండో రోజు ఆర్టీసీ ఉద్యోగులు వారి సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఉద్యోగోన్నతులు వెంటనే ఇవ్వాలని స్పష్టం చేశారు. ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పాత బస్సులను తొలగించి, కొత్త సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. డీఏ బకాయిలను చెల్లించకుండా దీర్ఘకాలంగా జాప్యం చేయడాన్ని తప్పుపట్టారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్జునయ్య, కార్యదర్శి రమేష్‌కుమార్, జిల్లా ప్రచార కార్యదర్శి సతీష్‌నాయుడు పాల్గొన్నారు.

దాడి చేసిన వారెవ్వరినీ వదలం



టీడీపీ గూండాల దాడిలో గాయపడిన ప్రవీణ్‌ను పరామర్శిస్తున్న భూమన, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

- నాయకులు లేరని క్యాడర్‌పై దాడులు అమానుషం
- క్యాడర్‌ను కాపాడుకోవడానికి మేమున్నాం..
- అవసరమైతే జగన్‌మోహన్‌రెడ్డి చంద్రగిరికి వస్తారు
- జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

చంద్రగిరి: చంద్రగిరిలో అరాచక పాలన సాగుతోందనడానికి వరుసగా జరుగుతున్న దాడులే నిదర్శనం.. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి లేరని క్యాడర్‌పై దాడులు చేయడం అమానుషమని వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ×దాడులు చేస్తే భయపడి లొంగిపోతారని ఎలా అనుకుంటున్నారు... ఇక్కడ వున్నది పిరికిపందలు కాదు.. జగన్‌మోహన్‌రెడ్డి సైనికులు.. మా క్యాడర్‌ను కాపాడుకోవడానికి మేమంతా ఉన్నాం.. అవసరమైతే జగన్‌మోహన్ రెడ్డి చంద్రగిరికి వస్తారు.. అంటూ వైఎస్ఆర్ సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని నరశింగాపురం పంచాయతీ వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌పై టీడీపీ గూండాలు దాడి చేసి తల పగలగొట్టడాన్ని ఆయన ఖండించారు. శనివారం ప్రవీణ్‌కుమార్ ఇంటికి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డితో కలసి వచ్చిన ఆయన టీడీపీ గూండాల చేతిలో తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌కు ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన మాట్లాడుతూ.. చెవిరెడ్డిని, ఆయన బిడ్డను అక్రమ కేసుల్లో ఇరికించి ఆయన వెంట నడిచే క్యాడర్‌ను భయపెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక చెవిరెడ్డి చేతుల్లో నుంచి మిమ్మల్ని ఎవ్వరూ కాపాడలేరని, దాడులకు పాల్పడిన వారెవ్వరినీ వదిలే ప్రసక్తి ఉండదని స్పష్టం చేశారు. పల్లెల్లో ప్రశాంతమైన రాజకీయాలు చేసుకోవాలే తప్ప దాడులు చేసుకునే పరిస్థితి రాకూడదన్నారు. చంద్రగిరి చరిత్రలో ఇప్పటి వరకు అలాంటి సంస్కృతి లేదని, ఇప్పుడే వస్తోందన్నారు. దీనిని ఆరంభంలోనే అడ్డుకోవాలని, దానికి పోలీసులు సహకరించకుంటే భవిష్యత్తులో చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుందని సూచించారు. ఆ తరువాత చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ప్రవీణ్‌కుమార్‌తో పాటు వారి కుటుంబీకులకు అండగా నిలబడతామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీలో ఆరుగురికి చోటు

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వివిధ హోదాల్లో ప్రకటించిన పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలకు చెందిన ఆరుగురికి అవకాశం కల్పిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం ఉపాధ్యక్షులుగా పుంగనూరుకు చెందిన పుష్పావతి, రాష్ట్ర వైఎస్సార్ టీయూసీ జనరల్ సెక్రటరీగా తిరుపతికి చెందిన కేతంరెడ్డి మురళీరెడ్డి, రాష్ట్ర సెక్రటరీలుగా గంగాధర్ నెల్లూరుకు చెందిన వి.సుందర్ రాజు, సత్యవేడుకు చెందిన జేబీ.మునిరత్నం (జేబీఆర్), తిరుపతికి చెందిన తిరుమల రెడ్డి, భరత్ రెడ్డిని నియమించారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా చిత్తూరు జిల్లా నుంచి పలమనేరుకు చెందిన జి.ప్రహ్లాద, ఆర్.చెంగారెడ్డి, ఎస్‌డీ మురళీకృష్ణ, తిరుపతి జిల్లా నుంచి శ్రీకాళహస్తికి చెందిన షేక్ సిరాజ్‌బాషా నియమితులయ్యారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక


ఆదిత్య


హిమకేష్

తిరుపతి ఎడ్యుకేషన్: అండర్–15 రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు తిరుపతికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. జూన్ 29 నుంచి జూలై 1వ తేదీ వరకు మదనపల్లిలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో తిరుపతి జిల్లా జట్టు 2వ స్థానంలో నిలిచింది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన తిరుపతికి చెందిన ఆదిత్య, హిమకేష్‌లను రాష్ట్ర జట్టుకు రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప తెలిపారు. త్వరలో విశాఖపట్నంలో నిర్వహించనున్న క్యాంపులో పాల్గొననున్నారని, ఆ తరువాత పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున వీరిద్దరు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన వీరిని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

తాళం పగులగొట్టి చోరీ

- 55 సవర్ల బంగారు నగలు, 3 లక్షల నగదు అపహరణ


బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట పట్టణంలోని మూకాంబిక గుడి వీధిలోని ఓ ఇంటిలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనను బాధిత కుటుంబ సభ్యులు శనివారం రాత్రి గుర్తించారు. సమాచారం అందుకున్న నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ముకాంబిక గుడి వీధిలో నివాసం ఉంటున్న హరేంద్ర, అతడి భార్య సునీత శనివారం ఉదయం 10.30 గంటలకు గూడూరులో జరిగే జగన్నాథ యాత్రలో పాలు పంచుకునేందుకు వెళ్లారు. తిరిగీ రాత్రి ఇంటికి వచ్చే సరికి తలుపు తాళాలు పగులగొట్టి ఉండటాన్ని చూసి అవాక్కాయ్యారు. ఇంటిలోకి వెళ్లి చూడగా 30 సవర్ల బంగారు, నగదు రూ.50 వేలు, వెండి వస్తువులు, సునీత స్నేహితురాలిగా ఉన్న మరో మహిళకు సంబంధించిన 25 సవర్ల బంగారు నగలు, రూ.2.50 లక్షల నగదును చోరీ చేసుకుని వెళ్లి ఉండటాన్ని బాధితులు గుర్తించారు. అయితే ఈ దొంగతనం మధ్యాహ్న సమయంలో జరిగి ఉండవచ్చునని బాధితులు భావిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రబుల్ మేజర్

- డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానాన్నే కొనసాగించాలి
- డబుల్ మేజర్ వద్దే వద్దు అంటున్న కళాశాలలు
- ప్రైవేటు కళాశాలల పట్టు.. మెట్టు దిగిన ఉన్నత విద్యామండలి
- సింగిల్ మేజర్ విధానం వైపే ప్రభుత్వం మొగ్గు
- త్వరలో డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్

తిరుపతి సిటీ : ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కూటమి ప్రభుత్వ నిర్ణయంపై తిరగబడ్డారు. దీంతో ఉన్నత విద్యామండలి కాస్త వెనుకడుగు వేసింది. డిగ్రీ కోర్సులలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలని, డబుల్ మేజర్ సబ్జెక్ట్ విధానంతో తమకు తలనొప్పి తప్పదని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నత విద్యా మండలికి తెగేసి చెప్పినట్లు సమాచారం. దీంతో ఉన్నత విద్యామండలి సందిగ్ధంలో పడింది.

గత నాలుగు మాసాలుగా డబుల్ మేజర్ విధానాన్ని అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి ప్రత్యేక నిపుణుల కమిటీని నియమించి సుదీర్ఘంగా చర్చించి నివేదిక తెప్పించుకుంది. దీంతో పాటు డబుల్ మేజర్ సబ్జెక్ట్‌లకు సంబంధించి కరిక్యులమ్ సైతం కమిటీ రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. పేరొందిన కార్పొరేట్, ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వం ప్రతిపాదించిన డబుల్ మేజర్ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. దీంతో ఉన్నత విద్యామండలి డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయడంలో జాప్యం చేస్తోంది.

డబుల్ మేజర్‌తో సమస్యలు

డిగ్రీ కోర్సులలో డబుల్ మేజర్ సబ్జెక్ట్ విధానానికి, మల్టీ డిసెప్లేనరీ విధానానికి పెద్ద తేడా లేదని ప్రైవేటు కళాశాలలు, మేధావులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానంతోనే విద్యార్థులకు, అటు కళాశాలలకు ఎంతో ఉపయోగకరమని వారు వాదిస్తున్నారు. డబుల్ మేజర్ విధానంతో అధ్యాపకుల కొరత, నూతన అధ్యాపకుల నియామకం, కళాశాలలలో ల్యాబ్ సౌకర్యాలు ఇప్పటికిప్పుడు సమకూర్చుకోవడం సాధ్యం కాదని ఈ విధానం తలనొప్పితో పాటు భారీ ఖర్చుతో కూడుకున్నదని ప్రభుత్వానికి విన్నవించారు. ఇటు ప్రభుత్వ కళాశాలలు మాత్రం డబుల్ మేజర్ విధానం ప్రవేశపెడితే అడ్మిషన్లు పెరుగుతాయని అభిప్రాయాన్ని వెళ్లడిస్తున్నారు. దీంతో గత ప్రభుత్వ హయాంలో ప్రవేశ పెట్టిన సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానాన్ని కొనసాగించేందుకు ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఇంకా పూర్తి స్థాయిలో నిర్ణయం వెలువడాల్సి ఉంది.

ఈఏపీసెట్ కౌన్సెలింగ్ తర్వాతే నోటిఫికేషన్

డిగ్రీ నోటిఫికేషన్ కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 40 వేల మంది విద్యార్థులు మూడు మాసాలుగా ఎదురు చూస్తున్నారు. ఏప్రిల్ నెలలో ఇంటర్ ఫలితాలు విడుదలైనా ఇంత వరకు డిగ్రీ ప్రవేశాలపై ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకోకపోవడంతో దారుణమని విద్యార్థులు వాపోతున్నారు. కాగా ఈనెల 6వ తేదీ నుంచి ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్నాయి. తొలివిడత ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ పూర్తి అయిన తర్వాత నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

జిల్లా సమాచారం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	18
టీటీడీ కళాశాలలు	5
ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	104
సింగిల్ మేజర్ విధానాన్ని కొనసాగించాలంటున్న కళాశాలలు	106
డబుల్ మేజర్ కొనసాగించాలంటూ ప్రభుత్వాన్ని కోరిన కళాశాలలు	15
ఏదైనా సరే అంటూ సిద్ధపడ్డ కళాశాలలు	6
సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌తో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు	సుమారు 25 మంది
డిగ్రీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు	32,600

సింగిల్ మేజర్‌తో విద్యార్థులకు ప్రయోజనం



డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్‌లో డిగ్రీ పొందిన విద్యార్థికి అనేక ప్రయోజనాలు ఉంటాయి. ప్రధానంగా పోటీ పరీక్షలలో ఆప్షనల్ సబ్జెక్ట్‌గా యూజీలో తీసుకున్న మేజర్ సబ్జెక్ట్‌ను ఎంపిక చేసుకొని మంచి మార్కులు స్కోర్ చేసుకునేందుకు వీలుంటుంది.
– ప్రభాకర్‌రెడ్డి, ప్రైవేటు కళాశాల అధ్యాపకుడు, తిరుపతి

డబుల్ మేజర్‌ను ఎవరూ కోరడం లేదు



డబుల్ మేజర్‌ను ఏ విద్యార్థి కోరుకోవడం లేదు. మూడు, రెండు సబ్జెక్టులను మేజర్‌గా చదువుకునే విద్యార్థికి శ్రమ తప్ప ఉపయోగం ఉండదు. అధ్యాపకులు, మౌలిక సదుపాయాల కల్పనలో విద్యా సంస్థలు వెనుకబడతాయి. – రాజేశ్వరి, కార్పొరేట్ కళాశాల అధ్యాపకురాలు, తిరుపతి

పోటీ పరీక్షలకు ఉపయోగకరం



డిగ్రీలో సింగిల్ మేజర్ విధానం చదివిన వారికి సివిల్స్, గ్రూప్స్, ఈసెట్, పీజీసెట్, ఐసెట్, వంటి పోటీ పరీక్షలలో నెగ్గేందుకు సులువుగా ఉంటుంది. డబుల్ మేజర్‌తో రెండు ప్రధాన సబ్జెక్ట్‌లపై దృష్టి సారించాల్సి ఉంటుంది.
– శిరీషా, డిగ్రీ విద్యార్థిని, తిరుపతి

ఫీజురీయింబర్స్‌మెంట్ ఊసేలేదు



ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి కూటమి ప్రభుత్వం చెల్లించలేదు. మళ్లీ నూతన విధానం అంటూ డిగ్రీలో డబుల్ మేజర్ సబ్జెక్ట్‌ను ప్రవేశపెట్టి విద్యార్థుల జీవితాలతో అడుకుంటోంది. తల్లిదండ్రులు గత ఏడాది అప్పులు చేసి ఫీజు చెల్లించిన పరిస్థితి చూశాం.
– లక్ష్మీనరసింహులు, విద్యార్థి, రేణిగుంట

నోటిఫికేషన్ రాకపోవడం బాధాకరం



ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ నెలలో వచ్చాయి. కానీ ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కాకపోవడం ఆశ్చర్యం. విద్యావ్యవస్థలో ఏ విధానాన్ని కొనసాగించాలో తెలియక ఉన్నత విద్యామండలి తికమక పడుతూ అడ్మిషన్లు జరపకుండా ఆలస్యం చేయడం బాధాకరం. – ప్రసన్న, డిగ్రీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న విద్యార్థి, తిరుపతి రూరల్

లోక్ అదాలత్‌లో 2352 కేసుల పరిష్కారం

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 2352 కేసులు పరిష్కారం అయినట్లు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ గురునాథ్ తెలిపారు. పరిష్కారమైన కేసులలో 371 కోర్టుల్లో పెండింగ్ ఉన్న సివిల్ , క్రిమినల్, మోటార్ వాహన ప్రమాద కేసులు, వివాహ సంబంధాల కేసులు, తదితర కేసులు ఉన్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. అలాగే 1981 జరిమానాలు చెల్లించే క్రిమినల్ కేసులను పరిష్కరించి నిందితులకు 60 లక్షలా 25 వేల వంద రూపాయలు జరిమానా విధించినట్లు న్యాయమూర్తి తెలిపారు. తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10:30 గంటలకు తిరుపతి మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ ప్రారంభమైంది. కేసుల పరిష్కారం కోసం ఈ జాతీయ లోక్ అదాలత్‌లో 8 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. జడ్జి గురునాథ్‌తో పాటు ఐదవ అదనపు జిల్లా జడ్జి రామ్ గోపాల్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి విజయసారధిరాజు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ, ఇతర జూనియర్ సివిల్ జడ్జిలు గ్రంధి శ్రీనివాస్ ,శ్రీకాంత్ , సత్యకాంత్ కుమార్, సంధ్యారాణి, కోటేశ్వరరావు ఈ లోక్ అదాలత్ బెంచ్‌లకు అధ్యక్షులుగా వ్యవహరించి కేసులను పరిష్కరించారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, పోలీస్ అధికారులు, బ్యాంకు, బీమా, ఆర్టీసీ ఇతర వివిధ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం.. పట్టుబడ్డ ఎర్రచందనం


ఎర్ర చందనం దుంగలు రవాణా చేస్తూ పట్టుబడ్డ వాహనం

నాయుడుపేటటౌన్: పట్టణ పరిధిలోని అగ్నిమాపకశాఖ కార్యాలయం సమీపంలో రహదారిపై బైక్‌ను ఢీకొని ఎర్రచందనం తరలిస్తున్న వాహనం శనివారం పోలీసులకు పట్టుబడింది. ఫారెస్ట్ డీఆర్వో కోటేశ్వరరావు తెలిపిన వివరాలు.. వెంకటగిరి వైపు నుంచి వస్తున్న కారు పట్టణ పరిధిలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదుట రహదారిపై వెళుతున్న బైక్‌ను ఢీకొంది. అక్కడ యూనిఫామ్‌లో అగ్నిమాపకశాఖ అధికారులు వచ్చేటప్పటికే కారులో ఉన్న డ్రైవర్‌తో పాటు మరొక వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యారు. కారు వెనుక డోర్‌లో తెరిచి చూడగా ఎర్ర చందనం దుంగలు ఉండడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి వాహనం అప్పగించినట్లు డీఆర్వో తెలిపారు. 237 కేజీలకు పైగా ఉన్న 46 ఎర్ర చందనం దుంగలతో పాటు వాహనం విలువ రూ. 3 లక్షలు వరకు ఉంటుందన్నారు.అటవీశాఖ రేంజ్ అధికారి రమణయ్య పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నట్లు డీఆర్వో వెల్లడించారు.

చెవిరెడ్డి అక్రమ అరెస్టుపై నిరసనలు


ఎర్రావారిపాళెం మండల కేంద్రంలో మహిళల నిరసన ర్యాలీ


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

భాకరాపేట: కూటమి ప్రభుత్వం కుట్రలో భాగమే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేసి జైలుకు పంపించారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఎర్రావారిపాళెం మండల కేంద్రంలో శనివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. చెవిరెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, సీఎం డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేకనే తప్పుడు కేసులు నమోదు చేయించి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. చెవిరెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోహిత్‌రెడ్డిపై పెట్టిన కేసును కూడా ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, పాకాల, తిరుపతి రూరల్, రామచంద్రాపురం ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీ మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

- మహిళా ఉద్యోగి మృతి, 15 మందికి గాయాలు


నిలిపి ఉంచిన లారీని ఢీకొన్న ప్రైవేటు బస్సు

రేణిగుంట : టైర్ పంచర్ కావడంతో రోడ్డు పక్కన ఆపి ఉన్న లారీని ఓ ప్రైవేట్ కంపెనీ బస్సు వెనుక వైపు వేగంగా వచ్చి ఢీకొనడంతో డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న మహిళా ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందింది. 15 మందికి గాయాలు కాగా ప్రైవేట్ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.. రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని ఒక ప్రైవేటు కంపెనీకి చెందిన బస్సు నారాయణవనం నుంచి తమ కంపెనీ ఉద్యోగులను ఎక్కించుకొని వస్తున్న సమయంలో శనివారం తెల్లవారుజామున సుమారు 5.30 గంటలకు రేణిగుంట సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాల ఎదురుగా టైర్ పంచర్ అవడంతో రోడ్డు పక్కన ఆపిన లారీని వెనుక వైపున ఢీకొంది. ఈ సంఘటనలో డ్రైవర్ పక్కన కూర్చొని ఉన్న నారాయణవనానికి చెందిన ఊహ మహాలక్ష్మి (25) మృతి చెందగా మరో మహిళకు కాలు విరిగింది. మొత్తం 15 మందికి గాయాలు కాగా పక్కనే ఉన్న ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. డీఎస్పీ శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. హాస్పిటల్లో చికిత్స పొందుతున్న వారిని రేణిగుంట తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు.

ఐఐటీలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ఏర్పేడు: తిరుపతి ఐఐటీలో మూడు రోజులుగా జరిగిన అంతర్జాతీయ సమావేశం శనివారంతో ముగిసింది. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎస్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఐఐటీ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ విభాగం ఆధ్వర్యంలో నిర్మాణ సామగ్రి, నిర్మాణాలపై మూడో అంతర్జాతీయ సమావేశం (ఐసీసీఎంఎస్– 2025)లో నిర్మాణ రంగంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై గొప్ప ప్రసంగాలు, ప్రదర్శనలు చేసి, ఆ రంగంలో ప్రపంచస్థాయి అభివృద్ధికి భవిష్యత్తు కార్యాచరణపై నిర్మాణాత్మక ప్రసంగాలు చేశారు. ఈ సమావేశానికి డజనుకు పైగా దేశాల నుంచి 550 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

సినర్జీ ఆఫ్ మెటీరియల్స్ అండ్ స్ట్రక్చర్స్ అనే అంశంపై వాతావరణ పరిణామాలు, వనరుల కొరత, డిజిటల్ పరివర్తన, పట్టణ సంక్లిష్టత తదితర తీవ్ర సవాళ్లను ఎదుర్కొనేందుకు అధునాతన నిర్మాణ రూపకల్పనతో మెటీరియల్ ఆవిష్కరణలపై చర్చించారు. సమావేశంలో 10 ప్లీనరీ లెక్చర్లు, 21 కీలక ప్రసంగాలు, 427 సాంకేతిక పత్ర ప్రజెంటేషన్లు, 113 పోస్టర్ సెషన్లు భౌతిక, హైబ్రిడ్ ఫార్మాట్లలో జరిగాయి. ఈ సెషన్లలో అల్ట్రా–హై–పెర్ఫార్మెన్స్ కాంక్రీట్, తక్కువ కార్బన్ సిమెంట్లు, డిజిటల్ నిర్మాణ సాంకేతికత, జీవిత చక్ర రూపకల్పన ఫ్రేమ్‌వర్క్‌లు, అగ్ని నిరోధక పదార్థాలు, నిర్మాణ ఆరోగ్య పర్యవేక్షణ అంశాలపై లోతైన అధ్యయనానికి దారితీసే చర్చలు ఫలప్రదంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన ప్లీనరీ స్పీకర్లు ప్రొఫెసర్ మైక్ షలెట్, ప్రొఫెసర్ జియాన్లూకా రాంజీ, ప్రొఫెసర్ మను సంతానం, ప్రొఫెసర్ మార్టిన్ మెన్సింగర్, ప్రొఫెసర్ వెంకటేష్ కోడూర్, ప్రొఫెసర్ బాల్తాసర్ నోవాక్, దామోదర్ కత్తి ప్రొఫెసర్ వసంత్ మత్సగర్, డాక్టర్ ఎస్. అలెగ్జాండర్ బ్రాండ్, డాక్టర్ జిట్టిన్ వర్గీస్, ప్రొఫెసర్ రాధాకృష్ణ పిళ్లై, ప్రొఫెసర్ ప్రదీప్ సర్కార్ ప్రసంగించారు. మౌఖిక, పోస్టర్ విభాగాలలో అసాధారణమైన ప్రదర్శనలను గుర్తించి, తొమ్మిది ఉత్తమ పేపర్, పోస్టర్ అవార్డులను ఐఐటీ డైరెక్టర్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐఐటీ సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సురేష్‌జైన్, సిబ్బంది పాల్గొన్నారు.

10న మెగా పీటీఎం

– తల్లికి వందనం పెండింగ్ పూర్తికి కృషి

తిరుపతి అర్బన్: ఈనెల 10న మెగా పీటీఎం(పేరెంట్స్ టీచర్స్ మీటింగ్) నిర్వహిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లికి వందనం పథకం అందని వారికి ఈనెల 10వతేదీకి తల్లి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని స్పష్టం చేశారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న పీటీఎంలో స్వల్ప మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు స్కూల్స్‌లోనే కాకుండా ఇంటర్ వరకు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆ మేరకు ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన 1 నుంచి ఇంటర్ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు హాజరుకావాలని సూచించారు. గత ఏడాది తల్లి మాత్రమే వచ్చారని...ఈ ఏడాది ఇద్దరు రావాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందిస్తామని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతారని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగుతుందని చెప్పారు. ప్రత్యేక మెనూ ఏర్పాటు చేశామని విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి సహపంక్తి భోజనం ఉంటుందని వివరించారు. మరోవైపు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు ×ఏక్ పేడ్ మాకే నామ్ పర్ట్ అంటే తల్లి పేరుతో ఒక మొక్కను నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐవో రాజశేఖర్, సమగ్ర శిక్ష సీఎండీ సురేష్, సూపరింటెండెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.